

జాతీయ తైక్వాండో పోటీల్లో ఆరు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


పతకాలు సాధించిన క్రీడాకారులు

ఈనెల 23 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్ లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి ఆరుగురు క్రీడాకారులు పాల్గొని, ఆరు పతకాలు సాధించారు. .షణ్ముఖ సిద్ధార్థ గోల్డ్ మెడల్ , హర్షవర్ధన్ సిల్వర్ మెడల్, వైష్ణవి దేవి సిల్వర్ మెడల్, రోహిణి బ్రాంజ్ మెడల్, హర్షిని బ్రాంజ్ మెడల్ , తరుణ్ బ్రాంజ్ సాధించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో టీం ఈ జాతీయ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ మూడో స్థానం కైవసం చేసుకుంది. వీరిని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు కోచస్ యశస్విని, కోటేశ్వరరావు అభినందించారు.

ప్రజాశక్తి, ఎపిఎంఎస్ఆర్‌యు, తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- 190 మంది రోగులకు వైద్యసేవలు
- ఉచితంగా మందులు పంపిణీ


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు, టిడిపి నాయకులు భాస్కరరావు, మాజీ ఎంపిటిసి ఆదిబాబు

ప్రజాశక్తి -డెంకాడ/కంటోన్మెంట్

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం డెంకాడ మండలం పెనతాడివాడ గ్రామంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ లెంక లక్ష్మణరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, మాజీ ఎంపిటిసి కె.ఆది బాబు ప్రారంభించారు.

విజయనగరం లోని తిరుమల- మెడికవర్ ఆస్పత్రి నుంచి వచ్చిన జనరల్ సర్జన్ డాక్టర్ శీలం నడేషన్ (ఎస్ఎన్) అభిప్రీతి, జనరల్ ఫిజిషియన్ సిహెచ్ అఖిలేష్, డెంకాడ పిహెచ్‌సి వైద్యులు అనూష రోగులను తనిఖీ చేశారు. వైద్య సేవలు పొందేందుకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రోగులు క్యూకట్టారు. శిబిరంలో ముందుగా బిపి, సుగర్ పరీక్షలు చేసిన అనంతరం రోగులకు వైద్యులు తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా గ్యాస్ ట్రైటిస్, ఆర్థరైటిస్, బిపి, షుగర్, గుండె సంబంధించిన వ్యాధులు, ఎనీమియా, నడుము నొప్పి, ఆయాసం, గుండె జబ్బులు సంబంధిత రోగాలకు వైద్య సేవలు అందించారు. సుమారు 190 మంది రోగులను తనిఖీ చేయగా 70 మందికి ఇసిజిలను ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో రోగులకు అవసరమైన సుమారు రూ.2లక్షల విలువైన మందులను మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఏర్పాటు చేసింది. అంతకుముందు వైద్య శిబిరం ప్రారంభం సందర్భంగా సర్పంచ్ లక్ష్మణరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి ఆధ్వర్యాన ఇటువంటి సామాజిక, సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ఈ ఉచిత వైద్యశిబిరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగ పడిందన్నారు. ఇలాంటి మరిన్ని వైద్య శిబిరాలు గ్రామంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆంకాలజీ వైద్య నిపుణులు డి.వెంకట సాంబశివరావు, ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి ఎన్.సుధీర్, ప్రజాశక్తి మేనేజర్ సిహెచ్ రాము, స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్‌నాయుడు, డెస్క్ ఇన్‌ఛార్జి పి.అప్పారావు, సమన్వయ కమిటీసభ్యులు కె.శ్రీనివాస్, ఎం.శాంతమూర్తి, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు మక్కువ రమణ, ఆర్ఎంపి డి.భాస్కర్‌వర్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు జి భవాని, డెంకాడ ఇన్చార్జి చింతపల్లి సత్యనారాయణ, ఆస్పత్రి, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు; మందులు అందజేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు

జిందాల్ భూములను రైతులకు అప్పగించాలి

- బెదిరింపు ప్రకటనలు సరికాదు
- రైతులకు, గిరిజనులకు అండగా పోరాడుతాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2006లో జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను చట్టప్రకారం పరిశ్రమ పెట్టనందున రైతులకు తిరిగి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు బెదిరింపు ప్రకటనలు చేయడం సమంజసం కాదని అన్నారు. శనివారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి భూములు తీసుకుని 17 సంవత్సరాలైనా నేటి వరకు ఎటువంటి పరిశ్రమలూ ఏర్పాటు చేయలేదని, స్థానిక ప్రజలకు ఉపాధి చూపలేదని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి తీసుకున్న భూములను ఐదేళ్లలో పరిశ్రమ కట్టకపోతే తిరిగి రైతులకు అప్పజెప్పాలని చట్టంలో ఉన్న విషయం కలెక్టర్‌కు తెలియదా అని ప్రశ్నించారు.2006 భూ సేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఎందుకు అప్పటి జాయింట్ కలెక్టర్ నిర్వహించారని ప్రశ్నించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ చేస్తే ఇప్పుడు అధికారంలో ఉన్న టిడిపి నాయకులు ఆ రోజు పరిశ్రమను వ్యతిరేకించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. పరిశ్రమ పెట్టకపోతే భూములు వెనక్కి ఇవ్వకుండా ఇప్పుడు ఎంఎస్ఎంఇ పార్కు పెడతామని, అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బెదిరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. నేటికీ పూర్తి స్థాయిలో రైతులకు నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. రైతుల నుంచి భూములు తీసుకోలేదని, అవి ప్రభుత్వ భూములని అనడం సరికాదన్నారు. మూడేళ్లు సాగులో ఉంటే భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఈ భూములు అప్పగించాలని కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. ఒక వేళ కొత్త పరిశ్రమ కోసం భూమి కావాలంటే పబ్లిక్ హియరింగ్ పెట్టి మళ్లీ భూ సేకరణ చేపట్టి రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలి తప్ప బెదిరించి తీసుకుంటామని అనడం సరికాదన్నారు. తాటిపూడి నీటిని సాగునీటి అవసరాలకే ఇవ్వాలని, జిందాల్ పేరుతో ఎంఎస్ఎంఇ పార్కుకు ఇస్తామనడం సరికాదని తెలిపారు. రైతులకు, గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని వారికి అండగా సిపిఎం పోరాడుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టి వి రమణ పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు రూ.12 కోట్లతో తాగునీటి పథకం

తాత్కాలికంగా కార్పొరేషన్ నుంచి నీటి సరఫరా
వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు
కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ వైద్య కళాశాలకు రూ.12కోట్లతో ప్రతిపాదించిన తాగునీటి సరఫరా పథకం నిర్మాణ పనులను పదిరోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రోజుకు 1 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు మొయిద వద్ద చంపావతి నదిపై ఈపథకాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం, నీటి సరఫరాపై తమ ఛాంబర్‌లో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత నీటి లభ్యత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ఇతర సమస్యలపై చర్చించారు.

కలెక్టర్ మాట్లాడుతూ చంపావతి నీటి పథకం పనులను పదిరోజుల్లో ప్రారంభించి, ఏడాది లోపల పూర్తి అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. మరో ఏడాది తరువాత వైద్య కళాశాలలో పిజి కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉందని, తద్వారా విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా పథకాన్ని నిర్మించాలని సూచించారు. ప్రస్తుతం నీటి అవసరాలు తీర్చేందుకు తాత్కాలికంగా వారం రోజులపాటు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించాలని సూచించారు. జెఎన్‌టియు జంక్షన్ నుంచి మెడికల్ కాలేజి వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ శాఖలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిపిఒ మల్లిఖార్జునరావు, గ్రౌండ్‌వాటర్ డిడి జి.శ్రీనివాసరావు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ఎన్.భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బడిబస్సులు వేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల రాస్తారోకో, ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామాల నుంచి పాఠశాలలకు, కాలేజీలకు వస్తున్న విద్యార్థులకు సమయానికి బడి బస్సులు లేక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సులు వెయ్యాలని డిమాండ్ చేస్తూ ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో శనివారం వివిధ కాలేజీల నుంచి ర్యాలీగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని రాస్తారోకో, డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాలు నుంచి పాఠశాలలు, కాలేజీల సమయానికి బస్సులు లేకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రణస్థలం, పైడిభీమవరం, కోస్టా నుంచి బస్సులు లేక అటునుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో రాలేకపోతున్నారని అన్నారు. చింతపల్లి, పూసపాటిరేగ, డెంకాడ వైపు బస్సులు వెయ్యాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కుమిలి, రామతీర్థలు, నెల్లిమర్ల ప్రాంతాల్లోను, బొబ్బిలి, గజపతినగరం, బొండపల్లి మీదుగా బడి బస్సులు వేయాలని డిమాండ్ చేశారు. బస్సులు లేకపోవడం వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. వెంటనే విద్యాశాఖా మంత్రి స్పందించి బస్సులు నడిపేలా ఆర్‌టిసి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు వంశీ, వివిధ విద్యా సంస్థలు నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.


డిపో వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్య సేవలు

చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి- గజపతినగరం

గజపతినగరం పరిసర మండలాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం గజపతినగరం ఏరియా హాస్పిటల్ కు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ మంత్రి శ్రీనివాస్ ద్వారా వైద్య పరికరాలు విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.17 కోట్లతో ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా పరిసర నాలుగు మండలాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి రూ.50లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అందజేయడం జరుగుతుందని, ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని. తద్వారా ఆధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. దీంతోపాటుగా సిఎస్ఆర్ ఫండ్ ద్వారా విశాఖపట్నం రౌండ్ టేబుల్ సంస్థ అందజేసిన 15 లక్షల రూపాయల విలువ చేసే అనస్తిషియా వర్క్ స్టేషన్, పల్స్ మానిటర్, ఐసియు మానిటర్ వంటి ఆధునిక పరికరాలను ఆసుపత్రికి అందజేసినట్లు తెలిపారు. బిడిఎల్ సంస్థ రూ.10 లక్షలు విలువ చేసే ఉపకరణాలను అందజేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్, రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


పల్స్ మానిటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రమాణ స్వీకార ఏర్పాట్లును మంత్రి పరిశీలన

ఈ నెల 30వ తేదీన గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా పివివి గోపాలరాజు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును శనివారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గజపతినగరం ఎఎంసిలో పరిశీలించారు.

ముగిసిన సచివాలయ కార్యదర్శుల బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయ కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తి అయిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, నెల్లిమర్ల, సాలూరు పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు బదిలీ ప్రక్రియ ముగిసింది. శనివారం ఎమినిటీస్, ప్లానింగ్ నకు సంబంధించిన కార్యదర్శులకు ఐచ్ఛిక, తప్పనిసరి బదిలీల ప్రక్రియ జరిగింది. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ 2 రోజులపాటు నిర్వహించనున్న కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు.కార్యక్రమంలో నెల్లిమర్ల కమిషనర్ ఏ.తారకనాథ్, బొబ్బిలి కమిషనర్ రామలక్ష్మి, పార్వతీపురం కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, సాలూరు మేనేజర్ బి.ఎం శివప్రసాద్, విజయనగరం కార్పొరేషన్ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.

అనాథ పిల్లల జాబితా పునఃపరిశీలన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలకు అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం వచ్చిన 22 దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తన ఛాంబర్ లో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పాన్సర్షిప్, ఫాస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ ప్రస్తుతం జిల్లాలో కోవిడ్ ప్రభావిత, అనాథ, హెచ్ఐవి ప్రభావిత 388 మంది పిల్లలకు నెలకు రూ.4వేలు రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఆర్థిక సహాయం కోరుతూ అందిన 22 దరఖాస్తులు కమిటీ ఆమోదానికి అధికారులు అందజేయగా, వాటిపై మరోసారి సమగ్ర విచారణ జరిపి, నివేదిక అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీయు లక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

3న వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి జిల్లా విస్తత స్థాయి సమావేశం వచ్చేనెల 3న ఉదయం 10 గంలకు జగన్నాథ ఫంక్షన్ హాల్లో జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీ లు, ఎంపిలు, పిఎ న్యూ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ముఖ్యనాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాలలందరినీ బడిలో చేర్చాలి

- ఇంటింటి సర్వే ద్వారా బాలలను గుర్తించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పలు శాఖల అధికారులు

ఐదేళ్లు నిండిన బాలబాలికలందరినీ బడిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి, బడిలో చేరని పిల్లలను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ప్రవేశాలు, సార్వత్రిక విద్యపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని, జిల్లావ్యాప్తంగా ఎన్రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్, సర్వే చేపట్టాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 31 నాటికి ఐదేళ్లు పూర్తి అవుతున్న పిల్లలందరినీ విధిగా మొదటి తరగతిలో చేర్పించాలని చెప్పారు. 6 నుండి 15 సంవత్సరాల లోపు గల బాలబాలికలు అందరూ పాఠశాలలో ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఐదేళ్లు దాటిన పిల్లలంతా ఏ పాఠశాలలో చేరినది ఇంటింటి సర్వే నిర్వహించి తెలుసుకోవాలన్నారు. సర్వే జాబితాను, శిశు సంక్షేమశాఖ అందజేసిన జాబితాతో సరి చూసి, పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై విస్తత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రవేశాల ప్రక్రియ పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బడి మానేసిన విద్యార్థులను కూడా బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని అన్నారు.


సార్వత్రిక విద్య ద్వారా చదువు కొనసాగాలి

చదువుకోని వారు, చదువు మధ్యలో మానివేసిన వారికి విద్యను అందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఫెయిల్ అయిన, బడి మధ్యలో మానేసిన 14ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి పరీక్ష, 10 ఉత్తీర్ణులైన వారికి, ఇంటర పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో, జిల్లా వ్యాప్తంగా 60ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్‌ను, కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి అన్నపూర్ణ, డ్వామా పీడీ శారదాదేవి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, ఓపెన్ స్కూల్ కన్వీనర్ సన్యాశిరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోని సర్కారు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గాదెలోని గింజలు గాదెలోనే ఉండాలా. గుంటడు మాత్రం గారకాయలా ఉండాలన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. ప్రజాసమస్యలపై ప్రభుత్వం స్పందిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతోంది. సర్కారు సేవలు చేయించుకుంటుంది గానీ, వారికి ఉన్న సమస్యలు, ఇబ్బందులను మాత్రం పరిష్కరంచడం లేదు. దీంతో, గడిచిన వారమంతా స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు, చివరకు రైతులు, సాధారణ ప్రజానీకం ఆందోళన బాటపట్టారు. ముఖ్యంగా మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు మార్చి నుంచి వేతనాలు మంజూరు నిలిచిపోయింది. బిల్లులు కూడా చెల్లించలేదు. దీంతో, తాము పస్తులు ఉండడంతోపాటు బడిపిల్లలకు భోజనం పెట్టేందుకు అప్పులు చేయాల్సివస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ధరల్లో మెనూ ఛార్జీలు పెంచకపోతే మంచి భోజనం సాధ్యం కాదని, కనీసం విద్యార్థికి 20 రూపాయలు మెనూ ఛార్జీలు పెంచాలని కూడా కోరుతున్నారు. రోజుకు రూ.100 చొప్పున నెలకు 3000 చెల్లిస్తే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఈనేపథ్యంలో కనీసం గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జీతాలు పెంచుతూ ప్రభుత్వం తక్షణమే జీవో ఇవ్వాలనేది వీరి డిమాండ్.



తాటిపూడి రిజర్వాయర్ నుంచి జిందాల్ భూముల్లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జారీ చేసిన జిఒ 14ను రద్దు చేయాలని, రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద రైతులు కూడా ధర్నా చేపట్టారు. రిజర్వాయర్ పరిధిలో సక్రమంగా నీరు అందక పంటలు దెబ్బతినీ రైతులు నష్ట పోతున్నారని, ఈ పరిస్థితిలో ప్రభుత్వాలు వున్న నీటిని పరిశ్రమలకు ఇస్తే ఇప్పుడు ఇంకా జిందాలు భూముల్లో చిన్న పరిశ్రమలకు నీరు ఇవ్వటానికి జిఒ విడుదల చేయడం అన్యాయమనేది రైతుల ఆవేదన. దీనిపై అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ నోరు మెదపడం లేదు. తమకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విఆర్ఎలు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ప్రమోషన్లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. జిఒ నెంబర్ 5ను సడలించి ప్రమోషన్లు కల్పించాలంటూ గ్రామ సచివాలయాల్లోని సర్వేయర్లు ఆందోళన బాటపట్టారు. కోళ్ల ఫారాలతో తాము అనారోగ్యానికి గురవుతున్నామంటూ మెంటాడ మండలం బిరసాడవలస గ్రామస్తులు నిరసన తెలియజేస్తున్నారు. వీరి రోధన అరణ్యవేదనగానే మిగిలిపోతోంది తప్ప అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోవడం లేదు. స్కూళ్లు, వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళనలు మిన్నంటాయి. ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా ఉమ్మడి జిల్లాలోని మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ వీటిని పట్టించుకోలేదు. నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్టుగా వ్యవరించడంతో ఆందోళనా కార్యక్రమాలు ఉద్యమ రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

పిల్లల్లో ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలి

ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్

విజయనగరం టౌన్: జీవితం కోసమే కాకుండా జీవితంలో ఉన్న పరిస్థితులను ఎదుర్కొనేలా విద్య మన పిల్లలను తయారు చేసేలా ఉండాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ అన్నారు. శనివారం గురజాడ పాఠశాల ఆధ్వర్యంలో '21 శతాబ్దంలో విద్యార్థులకు కావలసిన జీవన నైపుణ్యాలు' అనే అంశంపై తల్లిదండ్రులు, విద్యార్థులతో శనివారం ముఖాముఖి కార్యక్రమం జరిగింది.పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలని, నేటి కృత్రిమ మేధా కాలంలో ఒట్టి జ్ఞాపక శక్తికీ, బట్టీ చదువులకీ చోటే లేదన్నారు. తల్లిదండ్రులకు మార్కులు, ర్యాంకులపై వేలం వెర్రి తగ్గాలని, విమర్శనాత్మక దృష్టి భావ ప్రకటన సామర్థ్యం, భావోద్వేగాల నియంత్రణ (ఈక్యూ) లాంటి జీవన నైపుణ్యాలే భవిష్యత్తు ఉద్యోగాలకు కీలకం అని చెప్పారు. మన పిల్లలకు ఏ భాషా సరిగ్గా రావట్లేదని, ఇంగ్లీషులో పట్టు సాధించాలంటే ముందు అమ్మ భాష బాగా రావాలన్నారు. తెలుగును నిర్లక్ష్యం చేయడం వల్ల మన పిల్లలకే నష్టమని, కనీసం రెండో భాషగా తీసుకొని తెలుగును బాగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గురజాడ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజీ పాఠశాల హెచ్ఎం పూడి శేఖర్ , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత అవసరం

ప్రజాశక్తి - కొత్తవలస



కృత్రిమ కాలును అందిస్తున్న ప్రతినిధులు

వికలాంగులకు చేయూతనివ్వడం ఎంతైనా అవసరమని, వికలాంగులకు సేవలందించడంలో శ్రీ గురుదేవ్ ట్రస్ట్ ముందు ఉండడం గొప్ప విషయమని వీచో ఫౌండేషన్ జిఎం టీ.ప్రవీణ్ కొనియాడారు. శనివారం శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీచో ఫౌండేషన్ సహకారంతో కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముందుగా డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ హాస్పిటల్ భవనాన్ని సందర్శించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, హాస్పిటల్ చైర్మన్ శ్రీరాపర్తి జగదీశ్ కుమార్ చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం ట్రస్ట్ ద్వారా 100 మందికి పైగా వికలాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు, వీల్ ఛైర్స్, చంక కర్రలు, చెవిటి మెషిన్‌లు, అంధులకు పెన్షన్‌లు, ముసలి వాళ్లకు రేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణీంద్ర, ట్రస్ట్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

బొండపల్లి: స్థానిక మినీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. బొండపల్లి సెక్టారు పర్యవేక్షకరాలు జి.గౌరి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న పూర్వ ప్రాథమిక విద్యార్థులను క్రమాభివృద్ధి(గ్రాడ్యుయేషన్)లో భాగంగా ఆరవ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గంట్యాడ ఐసిడియస్ ప్రాజెక్ట్ అధికారి డి ఉమాభారతి, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు ప్రత్యేక దుస్తులు వేసి వారిని ఉత్సాహం పరిచారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి సెక్టారు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

112 మంది ఉద్యోగాలకు ఎంపిక

బొబ్బిలి: స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 112 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చెప్పారు. కళాశాల యాజమాన్యం వివిధ కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. జాబ్ మేళాకు 198 మంది హాజరవ్వగా 112మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరందరికి నియామక పత్రాలు ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

వంగర: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయుడు తిర్లింగి శ్రీనివాసరావు కోరారు. ఆయన శివ్వాం గ్రామంలో శనివారం వీధి వీధికి తిరగి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్య అందుతుందన్నారు.ఉచితంగా పుస్తకాలు, బ్యాగు తదితర సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ్వాం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

బొబ్బిలి: స్థానిక పొట్టిశ్రీరాములు ఉన్నత పాఠశాలలో 330 మంది విద్యార్థులకు 29వ వార్డు టిడిపి ఇంచార్జి టి.వెంకటేశ్వరరావు శనివారం ప్లేట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బేబినాయన జన్మదినం సందర్భంగా విద్యార్థులు భోజనం చేసేందుకు ప్లేట్లు పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు చైర్మన్ కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియాపై దాడిని ఖండిస్తున్నాం : ఎమ్మెల్యే

బొబ్బిలి: హైదరాబాద్ నగరం, జూబిలీ హిల్స్‌లో ఉన్న మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై కొందరు భౌతిక దాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామని ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రధాన రాజకీయ పార్టీకి సంబంధించి ఆ ఛానల్లో కొన్ని వార్తా కథనాలు ప్రచురించిన నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. మీడియాలో ప్రచారమయ్యే కథనాలపై అభ్యంతరం ఉంటే, చట్టపరంగా చర్యలు తీసుకోవాలి తప్ప, ఇలా భౌతిక దాడులు చేయడం తగదన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫెన్సింగ్ పోటీలకు ఆరుగురు ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 29న విజయవాడ డిఎస్‌సి ఇండోర్‌స్టేడియంలో జరుగు 9వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు స్థానిక విజి స్టేడియంలో అండర్ 10, అండర్ 12 విభాగాల్లో జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులను సైబర్ ,ఇప్పి, ఫాయిల్ విభాగాల్లో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుండి ఆరుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఎంపికకు రిఫరల్‌గా టి.అనిల్ కుమార్, బాలరాజు వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులకు డిఎస్‌డిఒ బి.వెంకటేశ్వరరావు, జిల్లా ఫెన్సింగ్ సంఘ సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలు జూలై 5వ తేదీ నుండి మహారాష్ట్ర నాసిక్ లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

వీధి దీపాల నిర్వహణకు చర్యలు

విజయనగరం టౌన్ : నగరంలో ప్రణాళికాబద్ధంగా వీధి దీపాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో శనివారం సిబ్బంది జమ్ము ప్రాంతంలో 53 వీధి దీపాలు మరమ్మత్తులకు గురి కాగా వాటిలో 29 వీధి దీపాలను సరిచేశారు. 41వ డివిజన్ కంటోన్మెంట్ ప్రాంతంలోనూ, 35వ డివిజన్ విటి అగ్రహారం లోనూ, 44వ డివిజన్ అయ్యన్నపేట లోను వీధి దీపాలను సరి చేశారు.

నేరాలు ఘోరాలు

లారీని ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శివడవలస గ్రామానికి చెందిన పైల గణేష్ బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు స్కూటీపై వెళ్తుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో కాలు పైనుంచి లారీ వెళ్లిపోయి కాలు నుజ్జునుజ్జు అయింది. గాయపడిన యువకుడిని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని దొంకినవలస, బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య గొల్లాది గ్రామ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు శనివారం బొబ్బిలి జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళని గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడం వల్ల గాని, రైలు నుంచి జారి పడడం వల్ల గాని తగిలినా గాయాలతో మృతి చెందినట్లు చెప్పారు. గుర్తుపట్టిన వారు రైల్వే ఎస్ఐ బాలాజీ రావుకు తెలపాలని కోరారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్



తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

విఆర్ఎల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పే హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అదనపు భారంతో ఒత్తిడికి గురి చేస్తుందని వెంటనే విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అక్రమంగా వారికేస్తున్న డ్యూటీలను రద్దు చేయాలని, ఏళ్ల తరబడి విఆర్ఎలుగా పనిచేస్తూ అర్హత ఉన్నవారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జులై 9న దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ఉద్యోగ సంఘాలు పిలుపు మేరకు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొంటామని శనివారం తహశీల్దార్ రత్నకుమార్‌కు మండల విఆర్ఎల అధ్యక్షులు ఏ.సురేష్ ఆధ్వర్యంలో ఎల్ సునీత, ఈ వెంకటి, తుపాకుల గోపి తదితరులు సమ్మె నోటీసు అందించారు. అనంతరం మండల విఆర్ఎల సంఘం అధ్యక్షుడు ఏ.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్న విఆర్ఎలు జూలై 9వ తేదీన జరగనున్న సమ్మెలో పాల్గొని జయప్రదం చేస్తామని ఆ యూనియన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెనోటీసు

జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలియజేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్, మినీ వర్కర్లు గజపతినగరం ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరికి శనివారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ అధ్యక్షులు ఎం.సుభాషిని మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు వై నారాయణమ్మ, త్రివేణి, సన్యాసమ్మ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రజాపక్షమా? యజమాని పక్షమా?

సిపిఎం నాయకులు రాములు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని బిరసాడవలసలో కోళ్లఫారాన్ని తక్షణమే మూసివేయాలని ప్రజలు పోరాడుతుంటే గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి కనీసం పట్టించుకోపోవడం సరికాదని సిపిఎం నాయకులు రాకోటి రాములు అన్నారు. మండల కేంద్రంలో నిరసన దీక్షా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ 25 రోజులుగా పలు గ్రామాల ప్రజలు కోళ్లఫారానికి వ్యతిరేకంగా పోరాడు తుంటే ప్రజాప్రతినిధులు పట్టించుకోపోవడం అన్యాయమని అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ ప్రజాసమస్యలను పట్టించుకోపోవడం సరికాదన్నారు. పార్టీ యజమాని డబ్బులు ఎరజూపి ఉద్యమాన్ని నీరు గార్చేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. మంత్రులు చొరవ తీసుకొని కోళ్ల ఫారాన్నిమూసివేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కొందరు నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్న కోళ్లఫారం యజమాని ఆ వ్యక్తి పేరు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - చీపురుపల్లి


ఖరీఫ్ సీజన్‌లో వరి నారుమడులను సిద్ధం చేస్తున్న రైతులు విత్తన శుద్ధిని తప్పనిసరిగా జరపాలని ఎఒ ఎస్ఎస్ సూర్యకుమారి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేస్తున్న వరి విత్తనాలతో పాటు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్న సూడోమోనస్ అనే విత్తన శుద్ధి మందుతో విత్తన శుద్ధి చేయాలని సూచించారు. ఒక కేజీ విత్తనాలకు ఎనిమిది గ్రాముల మందుని నారుమడిలో వేసే ముందు రోజున విత్తనాలకు పట్టించి తరువాత నారుమడిలో వేసుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల వరి నారుకు సోకే అగ్గి తెగులు పొడతెగులు సోకకుండా నివారించగలమని చెప్పారు. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు అందజేయడానికి తమ సిబ్బంది గ్రామాల వారీగా సిద్ధంగా ఉంటారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

గృహ నిర్మాణ శాఖలో

ఉద్యోగం రావడం ఎంతో అదృష్టం

హౌసింగ్ డిఇ పలగర అప్పయ్య

ప్రజాశక్తి-బొబ్బిలి



గృహ నిర్మాణ శాఖలో ఉద్యోగం రావడం ఎంతో అదృష్టమని ఆ శాఖ డిఇ పలగర అప్పయ్య అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రతి మనిషి మనుగడకు గూడు, గుడ్డ, తిండి అవసరమని తెలిపారు. అలాంటి పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేసే గృహ నిర్మాణ శాఖలో ఉద్యోగం రావడం ఎంతో అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. తన సొంత గ్రామం బలిజిపేట మండలం బర్లి ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు, పార్వతీపురం ఆర్‌సిఎం హైస్కూల్‌లో 6 నుంచి పదో తరగతి వరకు, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో విద్యను అభ్యసించినట్లు చెప్పారు. 1987లో డిప్లొమో పూర్తి చేయగా, రిలీవ్ అయిన నుంచి 1991 వరకు ప్రయివేట్ సివిల్ కాంట్రాక్టర్ వద్ద సైట్ ఇంజినీర్‌గా పని చేశానన్నారు. 1992లో గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతల్లో చేరి 2006 వరకు పని చేయగా, 2006లో ఎఇగా ఉద్యోగోన్నతి లభించిందని చెప్పారు. 2006 నుంచి 2020 వరకు ఎఇగా గరుగుబిల్లి, పార్వతీపురం, మక్కువ, రామభద్రపురం మండలాల్లో పని చేసినట్లు వివరించారు. 2020లో డిఇగా ఉద్యోగోన్నతి రావడంతో విజయనగరం జిల్లా కార్యాలయంలో డిఇగా బాధ్యతలు స్వీకరించి 2021వరకు పని చేసి, అనంతరం బొబ్బిలి బదిలీపై వచ్చినట్లు చెప్పారు. ఆర్నెల్లు బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల ఇన్‌ఛార్జి ఇఇగా పనిచేసినట్లు తెలిపారు. పని చేసిన అన్ని మండలాల్లో సంతృప్తిగా విధులు నిర్వహించినట్లు వెల్లడించారు.

మక్కువ మండలంలో పని చేస్తున్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను మెండంగిలో గిరిజనులు ప్రారంభించలేదన్నారు. నిర్మాణ సామగ్రి కూడా గ్రామానికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పాటు బిల్లులు సక్రమంగా రావన్న భయంతో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదని చెప్పారు. దీంతో ఎఇగా గ్రామానికి వెళ్లి గ్రామపెద్దలు, లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో చేస్తామని హామీ ఇచ్చి, 52 మందితో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. తన చిన్నతనంలోనే తల్లి చినఅప్పమ్మ మరణిస్తే, తండ్రి గురయ్య రైతు కూలీగా పనులు చేసుకుని తనతోపాటు ముగ్గురు సోదరులు సింహాచలం, స్వామి, తోమాస్, అక్క కళావతిని చదివించినట్లు చెప్పారు. పెద్దన్నయ్య సింహాచలం తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారని చెప్పారు. పార్వతీపురంలో పనిచేస్తున్న సమయంలో 2009, రామభద్రపురం పని చేస్తున్న సమయంలో 2019లో ఉత్తమ ఎఇగా అవార్డులు అందుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది జనవరిలో ఉత్తమ డిఇగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు అన్ని ప్రభుత్వ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా, గృహ నిర్మాణ శాఖలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పని చేసినట్లు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర ఇసి సభ్యునిగా పని చేసినట్లు చెప్పారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, లబ్ధిదారులను సమన్వయం చేసుకుని ఉద్యోగం చేస్తే ఎటువంటి ఇబ్బందులూ లేకుండా విధులు నిర్వహించవచ్చని తెలిపారు.

సిసి కెమెరాలతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల



సిసి పుటేజీని పరిశీలిస్తున్న ఎస్ఐ

సిసి కెమెరాలతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. శనివారం ఆయన పోలీసు స్టేషన్ వద్ద ఉన్న సిసి కెమెరాలతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న రాత్రి సుమారు 7గంటల సమయంలో గుషిని గ్రామానికి చెందిన చందక రమణ, మల్యాడ గ్రామానికి చెందిన మరో వ్యక్తి వాహనంపై వెళ్తూ సతివాడ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు వద్ద బైక్ పై నుంచి రోడ్డు పక్కన పడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారన్నారు. వారికి ఏమైందో చెప్పలేని స్థితిలో ఉండడంతో దగ్గర్లో ఉన్న వారు వారిని పోలీసులు సహాయంతో స్థానిక ఆసుపత్రికి తరలించారన్నారు. దీనిపైన నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లో హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, దర్యాప్తులో భాగంగా మండలంలో సతివాడ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా ఒక ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ సంఘటన జరిగిందని గుర్తించామన్నారు. దీనిపై సదరు ఆటోను సీజ్ చేసి, డ్రైవర్ పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు నేరాల నియంత్రణతో పాటుగా వాటిని చేదించడానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి గ్రామంలో వీటి ఏర్పాటుకు పెద్దలు, ప్రజలు యువత ముందుకు రావాలని ఎస్ఐ కోరారు.

గిరిజనులను బెదిరించడం సరికాదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట



నిరసన తెలుపుతున్న గిరిజనులు, దళితులు

జిందాల్ కంపెనీ కోసం భూములిచ్చి నష్టపోతున్న దళిత గిరిజనులకు మేలు చేయాలని, భూములు ఇచ్చినప్పుడు చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా ప్రజా సంఘాలు, పార్టీలు పోరాడుతుంటే జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న స్వయానా కలెక్టరే బెదిరించడం సమంజసం కాదని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. బొడ్డవరలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులకు మద్దతుగా శనివారం ఆయన మాట్లాడుతూ నిర్వాసితులందరూ ఎవరో మభ్యపెడితే ఆశ పెడితే ఆందోళనకు దిగలేదని కేవలం రెండు లక్షల ఐదు వేలకి భూమి తీసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. భూములు తీసుకున్నప్పుడు ఇస్తామన్న ఉద్యోగం, ఉపాధి ఇవ్వకుండా, జిందాల్‌కి భూమలిస్తే ఆ భూమిని ఎవరికో సైట్‌లు వేసి దారా దత్తం చేస్తే తమ పిల్లలు ఏమైపోతారని దళిత గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గిరిజనలకు దళితులకు మేలు చేయాలంటే చట్టాలే కాకుండా సామాజిక న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. భూమి తీసుకుని 18 ఏళ్లయిన కంపెనీ నిర్మించని జిందాల్‌ని ఏమనకుండా భూమి కోసం పోరాడుతున్న నిర్వాసితులను వారికి మద్దతిస్తున్న వారిని బెదిరించడం సరికాదన్నారు. ఎప్పటికైనా చట్టం ప్రకారం పేదల వద్ద తీసుకున్న భూములను పేదలకి అప్పగించి, మరలా ఆ పేదల వద్ద నుంచే భూసేకరణ చేసి పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పిస్తే ఎవరూ అడ్డురారన్నారు. కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు ఎంత బెదిరించినా నిర్వాసితులు పోరాడుతూనే ఉంటారని వారికి ప్రజాసంఘాల మద్దతి ఇచ్చి పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- పూసపాటిరేగ



పూసపాటిరేగ: బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని గొల్లపేట గ్రామానికి చెందిన చందక సూర్యనారాయణ (56) ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనుల్లో లేబర్‌గా పని చేస్తుండగా ఆకస్మికంగా ఫిట్స్ రోగానికి గురై అపస్మారక స్థితికి చేరారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా, ఆయన అక్కడే చికిత్స పొందుతూ మరణించారు. ఈ హఠాత్పరిణామం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. సూర్యనారాయణ కూలీగా పనిచేస్తూ తన భార్య, కుమారుడు, కుమార్తె బాధ్యతలు మోయడమే కాకుండా, కుటుంబానికి ఏకైక ఆదాయ వనరుగా ఉన్నారు. ఆయన మరణంతో కుటుంబం ఆర్థికంగా పూర్తిగా క్షీణించిపోయింది. ఈ ఘటనపై స్పందించిన జనసేన నాయకులు మహంతి శివ కెపిసి ప్రాజెక్టు లిమిటెడ్ హైదరాబాదు వారితో పరిహారం కోసం మాట్లాడారు. సహజ మరణం అంటూ పరిహారం ఇచ్చేందుకు వారు నిరాకరించారు. దీంతో శివ బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే లోకం మాధవి సమక్షంలో ఎట్టకేలకు ఆ సంస్థ యాజమాన్యం సంస్థ తరపున రూ.10 లక్షల ఆర్థిక సహాయంతోపాటు బాధిత కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరించింది. ఈ మేరకు శనివారం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సమక్షంలో, పూసపాటిరేగ జనసేన నాయకుడు మహంతి శివ ఆధ్వర్యంలో మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు రమేష్, కుమార్తె శ్యామలకు చెక్కును, ఉద్యోగ ఒప్పంద పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, తమ బాధను గుర్తించి సహకారం అందించిన ఎమ్మెల్యే మాధవికి, జనసేన నాయకుడు మహంతి శివకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టల్ బీమా సేవలు ఉధృతం

గజపతినగరం: పోస్టల్ బీమా సేవలను ఉధృతం చేస్తూ పోస్టల్ శాఖ అడుగులు వేస్తుందని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో ఇటీవలే జరిగిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళాలో పోస్టల్ శాఖ మీద నమ్మకంతో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందిస్తున్న కారణంగా బీమా తీసుకున్న వ్యక్తికి రెండు రోజులలో పాలసీ బాండ్‌ను శనివారం జాతీయ బీమా అవగాహన దినోత్సవం సందర్భంగా అందజేశామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ తీసుకోవాలని, త్వరతగతిన సేవలను అందిస్తున్నామని తెలిపారు.

బీమా చెక్కు అందజేత

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన చిప్పాడ రమణాజీ గుండెపోటుతో ఇటీవల మరణించడంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ క్లైమ్‌లో భాగంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేతుల మీదుగా కంపెనీ ఎజిఎం, డి.రామకృష్ణ ఆధ్వర్యంలో 11,31,558 రూపాయల చెక్కును నామిని చిప్పాడ రమాదేవికి శనివారం అందించారు. చిప్పాడ రమణాజీ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 1లక్ష రూపాయలు పాలసీ గత సంవత్సరం తీసుకున్నారు. పాలసీ తీసుకున్న 13 నెలల కాలంలో అనుకోకుండా మరణించడంతో బీమా సొమ్ము అందినట్లు ఎమ్మెల్సీ తెలిపరు. ప్రతీ ఒక్క కుటుంబం ఇన్సూరెన్స్ కట్టుకోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉండవన్నారు. భవిష్యత్తు రోజుల్లో మీ కుటుంబ అవసరాలకు, పిల్లలు చదువుకోవడానికి పలు అవసరాలకు ఉపయోగ పడతాయన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇంత వేగంగా నామినికు అమౌంట్ అందించి ఆర్థికంగా ఆదుకోవడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఆర్. రాంబాబు నాయుడు, కె. విజయలక్ష్మి, డెవలప్మెంట్ ఆఫీసర్ కె. జయశంకర్, మజ్జి గంగరాజు, ఎస్ఒలు పి.దేముడు, శివుడు, వెంకట్రావు, పార్వతి, వేమలి రోహినిలు పాల్గొన్నారు.

వారికి అదనపు నిధులు

ప్రజాశక్తి - రామభద్రపురం

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పక్కా ఇళ్లకు కూటమి ప్రభుత్వం అదనంగా నిధులు విడుదల చేసిందని హౌసింగ్ ఎఇ మత్స వెంకటేష్ తెలిపారు. మండల హౌసింగ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.70 వేల వంతున మంజూరు చేసిందని తెలిపారు. దీనికి సంబంధించి మండలంలో 141 మందికి లబ్ధి చేకూరిందని, ఇప్పటికే కొంత మందికి వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేశారని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. కొత్త ఇళ్ల మంజూరుకు ఇప్పటివరకు మండలంలో 1360 దరఖాస్తులు వచ్చాయని, మిగిలిన వారు ఈ నెలాఖరులోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అఖిల

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.బి.అఖిల సూచించారు. శనివారం విజయనగరం మండలంలోని నారాయణపురం గ్రామంలో ఉన్న హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని విద్యార్థులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సికిల్ సెల్ ఎనీమియా వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, పిహెచ్ఎన్ వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు డుమ్మా

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

గిరిజన గ్రామాల్లో గిరిజనుల సమస్యలపై వారి సామాజిక అవసరాలపై, ఆర్థిక చేయూతపై కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన దార్తి అభా భాగిదరి కార్యక్రమంలో సంబంధిత అధికారులు గైర్హాజరు అవుతున్నారు. ఈ నెల 26వ తేదీన పై కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. మండలంలో సిహెచ్ బొడ్డవలస సచివాలయ పరిధిలో నిమ్మలపాడులో నిర్వహించగా నిమ్మల పాడు గిరిజనులు బొడ్డవలస నుండి నిమ్మలపాడునకు వేసే రోడ్డును అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. కానీ దీనిపై వివరణ ఇచ్చేందుకు సంబంధిత అటవీశాఖ అధికారులు ఆ గ్రామసభకు డుమ్మా కొట్టారు. శనివారం ఎంపిడిఒ రవి కుమార్ అధ్యక్షతన దిబ్బగుడ్డివలస సచివాలయం పరిధిలో రాచ్చేరువలస గిరిజన గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తాగు నీటి సమస్య పై గిరిజనులు సభ దృష్టికి తీసుకు వచ్చినా సంబంధిత అధికారులు సమాధానం చెప్పేందుకు సదరు సభకు రాకపో వడంతో తీర్మానం చేసి వదిలేశారు. సంబంధిత అధికారులు హాజరు కాని ఈలాంటి గ్రామ సభలు ఎందుకని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో పిరిడి పిహెచ్‌సి వైద్యులు జి.భరద్వాజ్, వెలుగు ఎపియం పి.భాగ్యలక్ష్మి, ఎపిఒ లక్ష్మీపతిరాజు, టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, ఎంపిటిసి వి.నాగ రాజు, అంగన్‌వాడి, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిపిఒతో పంచాయతీ కార్యదర్శుల చర్చలు

ప్రజాశక్తి-విజయనగరం

పలు సమ స్యలపై జిల్లా పంచాయతీ అధికారి డి.మల్లికార్జునరావుతో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు చర్చలు జరిపారు. కార్య దర్శులు క్షేత్ర స్థాయిలో పడుతున్న ఇబ్బంది లను వివరించారు. ఐవిఆర్ కాల్స్ గురించి ఉదయాన్నే 5.30గంటలకు విధులకు వెళ్లమనడంతో మహిళలు, వృద్దులకు సమస్యలు ఎదురవు తున్నాయని తెలిపారు. జిఎస్‌డబ్ల్యుఎస్ వ్యవస్థ వేరు, పంచాయతీ వ్యవస్థ వేరుగా చేసి జిఎస్ డబ్ల్యుఎస్ విధులు నుండి విముక్తి చేయాలని కోరారు. క్లాప్ మిత్రాలు వేతనం రూ.10 వేలకు పెంచి, రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పంచాయతీ గ్రేడ్లు త్వరగా అమలు చేయాలని, పారిశుధ్యం, నీటిసరఫరా, వీధిదీపాలు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. డిపిఒ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వై. రమణ, ఉపాధ్యక్షులు ఎం. జగదీష్, కోశాధికారి టి. వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్. తవుడు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీకాంత్, కార్యవర్గసభ్యులు వి.కిరణ్ కుమార్, సిహెచ్ అప్పలనాయుడు, కె.భాస్కర్ రావు, సిహెచ్ రమేష్, ఎ.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

చీపురుపల్లి: మండలంలో ఉన్న 19 పంచాయతీల్లో పారిశుధ్యం పట్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సురేష్ కుమార్ తెలిపారు. అందులో భాగంగానే శనివారం చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఉన్న 21 వార్డులలో కాలువలు పూడికతీత పరిసరాలు పరిశుభ్రత, తాగు నీరు క్లోరినేషన్ వంటి వాటిని పర్యవేక్షించామన్నారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ ఎంపిడిఒ పర్యవేక్షణలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఏరియా, వంగపల్లి పేట, జి అగ్రహారం, మెట్ట కాలనీ, పిల్లపేట, కుమ్మరికాలనీ, కొత్త అగ్రహారం, విజయకాలనీ, లెక్చరర్స్ కాలనీ, రామాంజనేయ కాలనీ, ఆంజనేయపురం, విజయనగరం రోడ్డు నుండి రాజాం రోడ్ వరకు మెయిన్ రోడ్డుకి ఇరువైపులా ఉన్న పెంట కుప్పలు జెసిబి యంత్రంతో ఐదు ట్రాక్టర్లతో తరలించే కార్యక్రమం చేపట్టామని ఎంపిడిఒ తెలిపారు. చీపురుపల్లి పంచాయతీ ఏరియాలో ఉన్న అన్ని ఒహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకర్లలో బ్లీచింగ్ క్లోరినేషన్, వీధులలో కాలువ పూడికలు తీయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై ఝాన్సీ రాణి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.